



## నూకాంబికను దర్శించుకున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి

**అనకాపల్లి టౌన్, అక్టోబరు 10:**
స్థానిక నూకాంబిక అమ్మవారిని బాలాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి దర్శించుకున్నారు. అంతకుముందు వీరికి ఆలయ నిర్వాహకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అర్చకులు బాలాలయంలో పూజలు చేయించి, ఆశీర్వదించారు. టీడీపీ నాయకుడు దాడి జయవీర్.. కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు అమ్మవారి చిత్రపటాలను అందజేశారు.



బాలాలయంలో నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి

## 'హౌసింగ్' చైర్మన్‌గా తాతయ్యబాబు ప్రమాణస్వీకారం

మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, కూటమి నేతల అభినందనలు

**బుచ్చెయ్యపేట, అక్టోబరు 10:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్‌గా బత్తుల తాతయ్యబాబు గురువారం విజయవాడలోని సంస్థ కార్యాలయంలో పదవీ స్వీకారప్రమాణం చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య మధ్యాహ్నం 1.30 గంటలకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కె.పార్థసారథి, హోం మంత్రి వి.అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, సుందరపు విజయ్ కుమార్, యార్లగడ్డ వెంకటరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, కూటమి పార్టీల నాయకులు పీవీఎస్ఎన్ రాజు, ఈర్లె శ్రీరామ్మూర్తి, గేదెల సత్యనారాయణ, గునూరు మల్లునాయుడు, గండి బాబ్జీ, పీవీజీ కుమార్, పైలా ప్రసాదరావు, దొండా నరేష్, గోకివాడ కోటేశ్వరరావు, శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, వెలంకాయల గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తాతయ్యబాబును పూలమాలలు, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ లక్ష్యసాధనకు అహర్నిశలు పాటుపడతానని, అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలు మంజూరు చేయడమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు.



రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బత్తుల తాతయ్యబాబు. చిత్రంలో ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే బండారు, హౌసింగ్ ఎండీ కె.రాజాబాబు వున్నారు.

## విద్యుత్ స్మార్ట్ మీటర్లు

తొలి దశలో పరిశ్రమలు, వాణిజ్య, ప్రభుత్వ సంస్థల సర్వీసులకు ఏర్పాటు

- రెండో దఫాలో ఇళ్లకు కూడా...
- అనంతరం ప్రీపెయిడ్ విధానం అమలు
- సెల్‌ఫోన్ మాదిరిగా రీచార్జి
- నగదు ఉన్నంత వరకే విద్యుత్తును వినియోగించుకునే అవకాశం

**నర్సీపట్నం, అక్టోబరు 10:**
త్వరలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు అందుబాటులోకి రానున్నాయి. సెల్‌ఫోన్‌కి రీచార్జి చేసుకున్నట్టే విద్యుత్ వినియోగారులు కూడా రిచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. ఎంత నగదుతో రీచార్జి చేసుకుంటే అంత పరిమితికి విద్యుత్ వినియోగించుకోవాలి. సెల్‌ఫోన్‌కి మెసేజ్ వచ్చిన వెంటనే రీచార్జి చేసుకోవాలి. లేకపోతే ఆటోమేటిక్‌గా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

తొలిదశలో పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వరంగ సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. ప్రభుత్వ సంస్థల విద్యుత్ సర్వీసులకు ప్రాధాన్యం ఇచ్చిన తరువాత పరిశ్రమలు, వాణిజ్య సర్వీసులకు స్మార్ట్ మీటర్లు బిగిస్తారు. రెండో దశలో ఇళ్ల సర్వీసులకు స్మార్ట్ మీటర్లు అమర్చుతారు. అన్ని సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పూర్తయిన తరువాత ప్రీపెయిడ్ సేవలు అందుబాటులోకి వస్తాయి. అదానీ కంపెనీ సిబ్బంది ఈపీడీసీఎల్ లైన్‌మన్ ... మిగతా 8వ పేజీలో



వీధి దీపాల కోసం స్మార్ట్ మీటరు అమర్చుతున్న సిబ్బంది (ఫైల్ ఫొటో)



నగదు, బంగారం, వెండి ఆభరణాలతో అమ్మవారికి అలంకరణ

## కన్యకాపరమేశ్వరికి రూ.4 కోట్లతో అలంకరణ

**విశాఖపట్నం, అక్టోబరు 10:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం విశాఖ వన్‌టౌన్‌లోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారు స్వర్ణ వస్త్రాలంకరణలో మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని, గర్భగుడిని రూ.4 కోట్ల నగదు, ఆరు కిలోల స్వర్ణాభరణాలు, పది కిలోల వెండి ఆభరణాలతో అత్యంత సుందరంగా అలంకరించారు.

## సలామ్ టాటా

విశాఖ మదిలో పారిశ్రామిక దిగ్గజం

- 2018లో నగరానికి రాక
- ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరు
- విశాఖను డైనమిక్ సిటీగా పేర్కొన్న టాటా
- ఇక్కడ గడిపిన రోజును జీవితాంతం గుర్తుంచుకుంటానని వెల్లడి



ఏయూ పూర్వ విద్యార్థుల సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రతన్ టాటా (ఫైల్)

**విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):**
జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య యవనికపై తనదైన ముద్ర వేసిన పారిశ్రామికవేత్త, చైర్మన్ ఎమెరిటస్ ఆఫ్ టాటా సన్స్...రతన్ టాటా ఆరేళ్ల క్రితం ఒకసారి విశాఖపట్నాన్ని సందర్శించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాటి జ్ఞాపకాలను నేడు పలువురు గుర్తుచేసుకుంటున్నారు.

2018 డిసెంబరు 10న ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థుల సమావేశం ఆర్కే బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. ఈ సమావేశానికి రతన్‌టాటా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముంబై నుంచి ప్రత్యేక విమానంలో వచ్చిన ఆయనకు అప్పటి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త, జీఎంఆర్ గ్రూపు సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జునరావు తదితరులు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. రతన్‌టాటాను విశాఖ తీసుకురావడానికి జీఎంఆర్ చొరవ తీసుకున్నారు. ఏయూ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత రతన్‌టాటాపై ఒక నృత్య రూపకం ప్రదర్శించారు. ఆయనకు చిత్రపటాన్ని బహూకరించారు. ఏయూలో జరిగిన నాటి సమావేశంలో గడిపిన క్షణాలను జీవితాంతం గుర్తుంచుకుంటానని రతన్ టాటా ఎంతో భావోద్వేగంతో ... మిగతా 8వ పేజీలో



సబ్బవరం ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న సిబ్బంది

## మద్యం షాపులకు పోటాపోటీ

**136 దుకాణాలకు 2,429 దరఖాస్తులు**

- నేటితో ముగియనున్న గడువు
- చివరి రోజు భారీ ఎత్తున దరఖాస్తు చేసే అవకాశం

**అనకాపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):**
మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తుల ప్రక్రియ ఊపందుకున్నది. మద్యం వ్యాపారం చేయాలని భావిస్తున్న వారు పెద్ద ఎత్తున దరఖాస్తులు అందజేస్తున్నారు. గురువారంనాటికి 136 మద్యం షాపులకు (జీవీఎంసీ అనకాపల్లి జోన్ మినహాయించి) 2,429 దరఖాస్తులు అందాయి. 9వ తేదీ బుధవారంనాటికి 1,216 దరఖాస్తులు అందగా, గురువారం ఒక్క రోజే 1,213 దరఖాస్తులు రావడం విశేషం. జిల్లాలో ఎనిమిది ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సర్కిళ్లు వున్నాయి. అనకాపల్లి సర్కిల్‌లో 15 షాపులకు 299 దరఖాస్తులు, సబ్బవరం పరిధిలో 19 షాపులకు 225, నర్సీపట్నంలో 21 షాపులకు 376, గొలుగొండలో 8 షాపులకు 196, ఎలమంచిలిలో 20 షాపులకు 465, చోడవరంలో 22 షాపులకు 385, పాయకరావుపేటలో 18 మద్యం షాపులకు 267, వి.మాడుగులలో 13 షాపులకు 219 దరఖాస్తులు అందినట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి సుధీర్ తెలిపారు. మద్యం షాపుల కోసం శుక్రవారం సాయంత్రం ఏడు గంటల వరకు దరఖాస్తులు అందజేయవచ్చని, చివరి రోజు కావడంతో భారీగా దరఖాస్తులు అందే అవకాశం వుందని ఆయన చెప్పారు.

## లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్

ఐదుగురికి బలమైన గాయాలు

- లారీ డ్రైవర్ ఒక్కసారిగా వేగం తగ్గించడంతో ప్రమాదం
- కాకినాడ నుంచి విశాఖ వస్తున్న నాన్‌స్టాప్ బస్సు

**ఎస్.రాయవరం, అక్టోబరు 10:** మండలంలోని పెనుగొల్లు వద్ద హైవేపై గురువారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం సంభవించింది. కాకినాడ నుంచి 36 మంది ప్రయాణికులతో విశాఖ వెళుతున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ నాన్‌స్టాప్ బస్సు, ముందు వెళుతున్న లారీ ఆకస్మికంగా వేగం తగ్గడంతో వెనుక నుంచి బలంగా ఢీకొన్నది. దీంతో కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వీరవరం గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ ఎం.తాతాజీతోపాటు బస్సులో ప్రయాణిస్తున్న విశాఖకు చెందిన ఐఎస్ఎన్ రాజు, ఒడిశాకు చెందిన కె.చంద్ర సబత్, రంజన్ పాంగి, కాకినాడకు చెందిన పి.మంగకు బలమైన గాయాలు అయ్యాయి. విజయనగరానికి చెందిన ఎం.చాణక్య, కాకినాడకు చెందిన రత్నకుమారి, మురళీకృష్ణ, విశాఖ మద్దిలపాలేనికి చెందిన నూకరత్నంతోపాటు మరికొందరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. బస్సు ముందు భాగం బాగా దెబ్బతినడంతో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు శ్రమించి అతనిని బయటకు తీశారు. క్షతగాత్రులను 108 అంబులెన్సుల్లో నక్కపల్లి సామాజిక ఆస్పత్రికి తరలించారు. లారీని బస్సు ఢీకొన్న సమయంలో బస్సు వెనుక ... మిగతా 8వ పేజీలో



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు ముందు భాగం



నక్కపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బస్సు డ్రైవర్ తాతాజీ, ప్రయాణికుడు రంజన్ పాంగి

## బార్క్ తీరుతో రైతుల ఇక్కట్లు

- రోడ్డుకి ఇరువైపులా ఇనుప ముళ్ల కంచె ఏర్పాటు
- నివాసాలకు అవతలవైపున పంట పొలాలు
- కంచె కారణంగా నాలుగు కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి



9లో



## పెద్ద దిక్కులేని పట్నం పీఎస్

- రెండు నెలలుగా ఇన్‌చార్జి పాలన
- తొలుత గొలగాని గోవిందరావును సీఐగా నియమిస్తూ డీఐజీ ఉత్తర్వులు
- గొలగాని గోవిందరావు కాదు గొల్లంగి గోవిందరావు అంటూ పోలీసు వర్గాల్లో చర్చ
- ఒక్కరు కూడా విధుల్లోకి చేరని వైనం



నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్

**నర్సీపట్నం, అక్టోబరు 10:**
నర్సీపట్నం పట్టణ పోలీస్ స్టేషన్‌లోనాలుగు నెలలుగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లేకుండా శాంతి భద్రతలు పర్యవేక్షణ కొనసాగుతున్నది. రూరల్ సీఐ రేవతమ్మ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. నెల రోజుల క్రితం పట్టణ సీఐగా గొలగాని గోవిందరావుని నియమిస్తూ డీఐజీ ఆఫీసు నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. వాస్తవంగా గుల్లంగి గోవిందరావుకి బదులు గొలగాని అని ఇంటి పేరు అచ్చు తప్పు పడిందని పోలీస్ వర్గాలలో అనుకున్నారు. గతంతో ఇక్కడ పట్టణ ఎస్సైగా పని చేసి, పదోన్నతిపై విశాఖపట్నం సిటిలో సీఐగా పని చేస్తున్న గుల్లంగి గోవిందరావు నర్సీపట్నం పట్టణ సీఐగా వస్తున్నారని అనుకున్నారు. ఉత్తర్వులు వెలుబడి నెల రోజులు కావస్తున్నా ఇద్దరు గోవిందరావులలో ఏ ఒక్కరు విధుల్లోకి చేరకపోవడం పట్టణంలో చర్చనీయాశంగా మారింది. గతంలో ఇక్కడ పని చేసిన పట్టణ సీఐ కాంతికుమార్‌ని జూన్ నెలలో డీఐజీ వీఆర్‌లో పెట్టారు. తర్వాత ఆయన్ని అల్లూరి జిల్లాకి ఎలాట్మెంట్ చేశారు. ప్రస్తుతం స్టేషన్‌లో ఇద్దరు ఎస్సైలు రమేష్, ఉమామహేశ్వరావు విధులు పని చేస్తున్నారు. ఇటీవల ఎస్సై ఉమామహేశ్వరరావు లీవ్ పెట్టడంతో స్టేషన్‌లో ఎస్సై రమేశ్ ఒక్కరే ఉన్నారు. ఎంతో కీలకమైన టౌన్ స్టేషన్‌ను నాలుగు నెలలుగా ఇన్‌చార్జి సీఐతోనే నెట్టు కొస్తున్నారు.

# జగాలనేలే తల్లికి జనం జేజేలు

▸▸ వాడవాడలా నేత్రపర్వంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ▸▸ వివిధ అలంకరణల్లో దర్శనమిచ్చిన ఆదిమాత


మహిషాసురమర్దినిగా కన్యకాపరమేశ్వరి


అనకాపల్లి కన్యకాపరమేశ్వరి ఆలయంలో సువాసినుల పూజలు


దుర్గాదేవి అలంకరణలో సతకంపట్టు కనకదుర్గమ్మ


నక్కపల్లి మండలం బంగారమ్మపేటలో కలశాల ఊరేగింపు

**అనకాపల్లి టౌన్, అక్టోబరు 10 :** శరన్నవ రాత్రి ఉత్సవా లను వాడవాడలా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ ఆలయాలు, మండపాల్లో దుర్గామాత గురువారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అనకాపల్లి నూకాంబిక ఆలయంలో ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు జరిపారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి హాజరై పూజలు చేశారు. సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దర్శించుకున్నారు. కన్యకాపరమేశ్వరి, కామాక్షిదేవి ఆలయాల్లో అమ్మవార్లు మహిషాసురమర్దినీదేవిగా దర్శనమిచ్చారు. గౌరీ పంచాయతన, సంతోషిమాత ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పలు చోట్ల భవానీ భక్తులు ఏర్పాటు చేసిన మండపాల్లో ఆదిమాతకు ప్రత్యేక పూజలు జరిపారు. సతకంపట్టులోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద ముత్తైయిదువులకు వాయినాల అందజేశారు. నిదానందొడ్డిలోని కామాక్షిదేవి అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ కోటిపల్లి శ్రీను ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదిలావుంటే, నూకాంబిక అమ్మవారి ఆలయంలో దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణాన్ని గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ వేడుకను తిలకించి తరించారు.

**నక్కపల్లి :** దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బంగారమ్మపేటలో దుర్గాభవానీ ఆలయ ధర్మకర్త గోసల శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం 108 కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ తరపున మహిళలందరికీ బోనాలు, జాకెట్టు ముక్కలను అందజేశారు. అలాగే, బోయపాడులోని దుర్గాభవానీ ఆలయంలో సామూహిక కుం కుమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తొలుత అమ్మవారికి విశేష అర్చనలు జరిపారు. ఇదిలావుంటే, నక్కపల్లిలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ నేతృత్వంలో బుధవారం రాత్రి దుర్గాదేవి అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. తొలుత అరటి డొప్పలతో మందిరాన్ని తయారుచేసి అందులో అమ్మవారి పటాన్ని ఉంచి పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**అచ్యుతాపురం :** అప్పన్నపాలెంలో దుర్గాదేవికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి కుంకుమార్చనలు జరిపారు.

## భూమి కాలువగట్టు ఆక్రమణ తొలగింపు


భూమి కాలువ గట్టుపై రేకులను తొలగిస్తున్న దృశ్యం

**పాయకరావుపేట, అక్టోబరు 10 :** పట్టణంలోని తాండవ షుగర్స్ సమీపంలో భూమి కాలువ గట్టు ఆక్రమణను అధికారులు గురువారం తొలగించారు. ఈ ఆక్రమణకు సంబంధించి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించడంతో జలవనరుల శాఖ అధికారులు అక్రమంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు, చుట్టూ రేకులతో ఏర్పాటుచేసి ప్రహరీని తొలగించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ జలవనరుల శాఖకు చెందిన పంట కాలువలు, గట్లు ఆక్రమించిన వారిపై పోలీసు కేసు నమోదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## 'పల్లె పండగ'లో పనులపై ఎంపీడీవో చర్చ


అధికారులతో చర్చిస్తున్న ఎంపీడీవో జయప్రకాశరావు

**పాయకరావుపేట, అక్టోబరు 10 :** మండలంలో పల్లె పండగ కార్యక్రమంలో సుమారు రూ.మూడు కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నామని ఎంపీడీవో జయప్రకాశరావు తెలిపారు. గురువారం ఇక్కడ వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. పల్లె పండుగ కార్యక్రమం ఈనెల 14 నుంచి 21 వరకు జరగనున్న నేపథ్యంలో పలు సూచనలు చేశారు.

## 'సహకార బ్యాంకులో ఈకేవైసీ చేసుకోవాలి'

**కశింకోట, అక్టోబర్ 10 :** నర్సింగబిల్లి సహకార బ్యాంకులో ప్రతి సభ్యుడు ఈకేవైసీ నమోదు చేసుకోవాలని సంఘం కార్యదర్శి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు ఆధార్ కార్డు, భూమి వివరాలు, సెల్ ఫోన్ నంబరు వివరాలు నమోదు చేసుకోవాలని వివరించారు.

## ఉపాధి హామీ పనుల పై గ్రామసభ


గ్రామసభ జరుగుతున్న దృశ్యం

**మునగపాక (తుమ్మపాల), అక్టోబరు 10 :** వాడ్రాపల్లిలో గురువారం ఉపాధి హామీ పనులపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ సిబ్బంది రానున్న ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులను వివరించగా, గ్రామస్థులు వాటిని ఆమోదించారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి పనుల ద్వారా పలువురికి ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాన్ని అభివృద్ధి చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



# హోదాలు మరిచారు.. పరిశుభ్రపరిచారు

▸▸ చీపుర్లు చేతబట్టిన అధికారులు, ప్రజాప్రతినిధులు ▸▸ స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పలు చోట్ల చెత్తాచెదారం, తుప్పలు తొలగింపు


ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో తుప్పలను తొలగిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, ఎమ్మెల్యే కొణతాల తదితరులు


పాయకరావుపేటలోని రాజుగారిబీడులో...


ఎలమంచిలి క్రీడా మైదానంలో...


నక్కపల్లిలో...


ఎస్.రాయవరంలో...

**అనకాపల్లి టౌన్, అక్టోబరు 10 :** స్వచ్ఛతా హీ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. ఇక్కడి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో గురువారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఆమెతో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఆర్డీవో షేక్ ఆయిషా పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాని సూచించారు. ఇంట్లో చెత్తను రోడ్డుపై వేయకుండి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇళ్ల ముందుకు వచ్చే పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. జిల్లాలో ప్రతివారం ఒక ప్రాంతంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నిర్ణయించారని, దీనిలో భాగంగా గురువారం ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులో పరిసరాలను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులో జిల్లా కలెక్టర్ సహకారంతో వాకింగ్ ట్రాక్, రెండు ఓపెన్‌జిమ్‌లను రూ.15లక్షలతో ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు. శారదానది ఒడ్డున అన్నమయ్య పార్కును నిర్మించి సుందరీకరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ ఏడీ రవికిరణ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి శకుంతల, కూటమి నాయకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, మళ్ల శ్రీను, చదరం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**కశింకోట :** ఉగ్గినపాలెంలో గురువారం శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. కూటమి నాయకులు సోమేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**పాయకరావుపేట :** స్వచ్ఛతా హీ సేవలో భాగంగా పట్టణంలోని రాజుగారిబీడులో గల పుంతరోడ్డును శుభ్రం చేశారు. ఎంపీడీవో జయప్రకాశరావు, ఈవోపీఆర్‌డీ సీహెచ్.చంద్రశేఖర్, పంచాయతీ ఈవో వర్మ, వార్డు సభ్యులు ధనిశెట్టి బాబి, పెంకే గోవింద్‌తో పాటు సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

**నక్కపల్లి :** ఇక్కడి హైవేకు ఆనుకుని ఉన్న ఆస్పత్రి పరిసరాల్లో చెత్త, వ్యర్థాలు, తుప్పల తొలగించారు. ఎంపీడీవో సీతారామరాజు నేతృత్వంలో నక్కపల్లి ఆస్పత్రి, వారపుసంత పరిసరాల్లో ఉన్న వ్యర్థాలను తొలగించి తీర్చిదిద్దారు. మండలప్రత్యేకాధికారి జి.ప్రభాకరరావు, సర్పంచ్ రత్నకుమారి, ఉప సర్పంచ్ వీసం రాజు, ఈవోపీఆర్‌డీ బి.సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎస్. రాయవరం:** మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు. ఇందులో భాగంగా పారిశుధ్య కార్మికులతో కలిసి చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేసారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ స్వచ్ఛత హీ సేవా 2024 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**ఎలమంచిలి :** పట్టణంలోని రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో మునిసిపల్ కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా క్రీడామైదానంలో ఉన్న తుప్పలను తొలగించారు. ఛైర్‌పర్సన్ రమాకుమారి, కమిషనర్ ప్రసాదరాజుతో పాటు ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, వాకింగ్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**రాంబిల్లి :** మండల కేంద్రం రాంబిల్లిలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా మండల ప్రత్యేకాధికారి పి.ప్రసాద్, ఎంపీడీవో జయమాధవి, ఈవోపీఆర్‌డీ రాజు పారిశుధ్య పనులు చేపట్టారు. మార్కెట్ స్థలంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## వీఆర్‌ఏల నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

**అనకాపల్లి టౌన్, అక్టోబరు 10 :** పట్టణంలోని శారదా నది ఒడ్డున శాంతి పార్కులో అనకాపల్లి మండల వీఆర్‌ఏల సమావేశం గురువారం ఏర్పాటైంది. కె.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్‌కేఆర్ బాషా, కార్యదర్శిగా చోడే అర్జునరావు, కోశాధికారిగా ఎస్.అభిరామ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి తమ వంతు పోరాటాన్ని సాగిస్తామని వివరించారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధి జి.సోమయ్య, ఆర్.అప్పారావు, అన్సర్ బీబీ, వెంకటలక్ష్మి, టి.ప్రసాద్, శివఅప్పారావు, రాధిక, నూకేశ్వరరావులతో పాటు పలువురు వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

## గ్రామాల్లోని మండపాల్లో అన్నసమారాధన

**కశింకోట, అక్టోబర్ 10 :** మండలంలోని తాళ్లపాలెం కూడలి, నర్సింగబిలిలలో జరుగుతున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం అన్నసమారాధన ఏర్పాటైంది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తొలుత అమ్మవారిని దర్శించుకుని అన్నసమారాధనను ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, నాయకులు కర్రి వెంకట సత్యనారాయణ, కాయల మురళీ, ఉల్లింగల రమేష్, కలిగట్ల సింహాద్రి, కర్రి గోవింద, బుదిరెడ్డి గంగయ్య, అయినాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం సందర్శించిన ఆర్డీవో

**మునగపాక (తుమ్మపాల), అక్టోబరు 10 :** మునగపాక రెవెన్యూ కార్యాలయాన్ని గురువారం అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషా పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ పనులను త్వరిత గతి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూముల రీ సర్వేకు సంబంధించిన వివరాలను తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు ద్వారా తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చే అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## 'బత్తుల'కు కూటమి నేతలు అభినందన


తాతయ్యబాబుతో ఎమ్మెల్యే విజయకుమార్

**మునగపాక/ఎలమంచిలి/రాంబిల్లి, అక్టోబరు 10 :** ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా విజయవాడలో గురువారం ప్రమాణ స్వీకారం చేసిన బత్తుల తాతయ్యబాబును ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్, ఎలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు కలిసి అభినందించారు. అలాగే, ఎలమంచిలి పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, కరణం రవి, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ తదితరులు కలిశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వియ్యపు అప్పారావు, పరవాడ మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్నా కలిసి అభినందనలు తెలిపారు.

## లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

... 7వ పేజీ తరువాయి

వాహనాలు ఏమీ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులతోపాటు బస్సులోని ప్రయాణికులు అభిప్రాయపడ్డారు. లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడని, బస్సు వేగాన్ని నియంత్రించేలోపే ప్రమాదం జరిగిందని బస్సు డ్రైవర్ తాతాజీ చెప్పాడు. ప్రమాదం గురించి తెలుసుకున్న ఎస్ఐ విభీషణ రావు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. హైవే సిబ్బంది వచ్చి ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తీయించడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## సలామ్ టాటా

... 7వ పేజీ తరువాయి

అన్నారని నాటి సమావేశంలో పాల్గొన్న పలువురు గుర్తు చేసుకున్నారు.

### ఏయూ పూర్వ విద్యార్థుల సమావేశంలో రతన్‌టాటా ప్రసంగం ఇలా సాగింది...

'మానవాళికి మేలుచేసే సరికొత్త ఆవిష్కరణల కోసం పరిశోధనలు చేయాలి. ప్రస్తుత అవసరాలను అనుగుణంగా విద్యా సంస్థలు బోధన, పరిశోధనలకు పరిశ్రమలతో కలిసి పనిచేయాలి. విద్యా వ్యవస్థను వాణిజ్య విపణితో అనుసంధానించడంతోపాటు వాటికి చేరువ చేయాల్సిన అవసరం ఉంది. ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేయడానికి టాటా గ్రూపు సిద్ధంగా ఉంది. వైద్యం, డేటా ఎనాలిసిస్, హ్యూమన్ జీనోమ్ వంటి రంగాల్లో పరిశోధనలు చేయాలి. వర్సిటీలకు పూర్వవిద్యార్థుల సహకారం అవసరం.' అని రతన్‌టాటా అన్నారు. విశాఖలో పెట్టుబడుల గురించి మాట్లాడుతూ ఏపీ పరిశ్రమలు పెట్టాలనే దానిపై దృష్టిసారిస్తామన్నారు. నాడు ఆయన చెప్పిన మాట ప్రకారం...విశాఖలో టీసీఎస్ కంపెనీ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది.

### విశాఖ గురించి రతన్‌టాటా....

"విశాఖ డైనమిక్ సిటీ. దేశంలోనే పరిశుభ్రమైన నగరం. అటువంటి నగరానికి టాటా గ్రూపు తోడ్పాటునందిస్తుంది. విశాఖలో గడిపిన ఈరోజు జీవితాంతం గుర్తుంచుకుంటా. దేవుడు ఇచ్చిన జీవితం ఉన్నంత వరకూ డిసెంబరు 10న విశాఖలో పర్యటన, ఇక్కడ గడిపిన క్షణాలు నా మదిలో ఉంటాయి. నాపై అభిమానంతో ఏర్పాటుచేసిన ప్రత్యేక నృత్య ప్రదర్శన ఎంతో ఆనందం కలిగించింది."తనపై ప్రదర్శించిన నృత్య రూపకాన్ని రతన్‌టాటా ఎంతో ఆసక్తిగా తిలకించడమే కాకుండా నృత్యకారులను సత్కరించి వారితో ముచ్చటించిన విషయాన్ని ఏయూకు చెందిన ఆచార్యుడొకరు గుర్తుచేసుకున్నారు. రతన్‌టాటా హాలులోకి వచ్చినప్పుడు, ఆయనకు చిత్రపటం బహూకరించినప్పుడు...ఇలా పలుసార్లు సభికులంతా లేచి హర్షధ్వానాలు చేశారు. ఆ కార్యక్రమం అనంతరం తాజ్ హోటల్‌లో ఏయూ విభాగాధిపతులతో రతన్‌టాటా భేటీ అయినప్పుడు దేశీయంగా సంపద సృష్టించే కంపెనీలు ఏర్పాటుచేసే దిశగా యువత ఆలోచన చేసేలా వారిని సన్నద్ధం చేయాలని సూచించారు.

### దేశం గొప్ప వ్యక్తిని కోల్పోయింది : అయ్యన్న

**నర్సీపట్నం:** ప్రముఖ వ్యాపారవేత్త, మానవతావాది రతన్ టాటా మన మధ్య లేకపోవడం బాధాకరమని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం ఆయన అమెరికా నుంచి విలేకరులకు పంపిన సందేశంలో రతన్ టాటా మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. దేశం గొప్ప వ్యక్తిని కోల్పోయిందని, ఆయన మరణం దేశానికి తీరని లోటు అని పేర్కొన్నారు.

## విద్యుత్ స్మార్ట్ మీటర్లు

... 7వ పేజీ తరువాయి

సమక్షంలో పాత మీటర్లను తొలగించి, వాటి స్థానంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. లైన్‌మన్ పాత మీటరు రీడింగ్ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. తరువాత పాత మీటరును కార్యాలయంలో అందజేస్తున్నారు. నర్సీపట్నం డివిజన్‌లో కేటగిరీ-2 వాణిజ్య సర్వీసులు 23,641, పరిశ్రమల సర్వీసులు 902, ప్రభుత్వ సర్వీసులు 6,352.. కలిపి మొత్తం 30,895 సర్వీసులు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు సుమారు మూడు వేల సర్వీసులకు స్మార్ట్ మీటర్లు బిగించారు. ఏదైనా ప్రాంతంలో విద్యుత్ సమస్య తలెత్తితే స్మార్ట్ మీటరు వల్ల పరిష్కారం చాలా సులభతరమవుతుందని సిబ్బంది అంటున్నారు.

### ప్రస్తుతానికి పాత మీటరు మాదిరిగానే..

స్మార్ట్ మీటర్‌కు ప్రీపెయిడ్ సర్వీస్ సిస్టమ్ యాక్టివేట్ చేసే వరకు పాత మీటరులాగే పని చేస్తుందని ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ తెలిపారు. ఇళ్ల సర్వీసులకు కూడా స్మార్ట్ మీటర్లు అమర్చడం పూర్తయితే ప్రీపెయిడ్ సర్వీసు అందుబాటులోకి వస్తుంది. అప్పటి వరకు స్మార్ట్ మీటర్లు బిగించిన పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ రంగ సర్వీసులకు ప్రతి నెలా రెండో తేదీన రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ వున్న సెల్ ఫోన్‌కి మెసేజ్ వస్తుంది. ఎన్ని యూనిట్లు వినియోగించారు, ఎప్పటిలోగా బిల్లు చెల్లించాలో తెలియజేస్తారు. ఇప్పటి మాదిరిగానే 15 రోజుల్లో బిల్లు చెల్లించకపోతే అపరాధ రుసుము తప్పదు. 30 రోజుల్లో చెల్లించకపోతే విద్యుత్ సరఫరా ఆపేస్తారు. స్మార్ట్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన తరువాత సెల్‌ఫోన్ రీచార్జి మాదిరిగా ముందుగానే డబ్బులు చెల్లించాల్సి వుంటుంది. రీచార్జి చేయించుకున్న నగదుకు తగ్గట్టు విద్యుత్ వినియోగించుకోవాలి. ఖాతాలో నగదు నిల్వలకు సంబంధించి ఎప్పటికప్పుడు పరిశీలించుకునే వెసులుబాటు వుంటుంది. నగదు నిల్వ అయిపోక ముందే రీచార్జి చేసుకోవాలి. లేదంటే ఆటోమెటిక్‌గా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

## తాతయ్యబాబుకు టీడీపీ నేతల అభినందనలు


బత్తులను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

**మాడుగుల, అక్టోబరు 10 :** విజయవాడలో గురువారం జరిగిన హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు ప్రమాణ స్వీకారానికి మాడుగుల టీడీపీ నాయకులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. తాతాయ్యబాబునుకలిసిన వారిలో మాడుగుల టీడీపీ మండల అధ్యక్ష,కార్యదర్శులు అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, నేతలు వద్దాది రంజిత్‌వర్మ, పుప్పాల రమేష్‌నందారపు సన్యాసిరావు, లెక్కల కాశిబాబు, పి.సూర్యనారాయణరాజు, మరువాడ ఈశ్వరరావు, వడ్డే రాజ్‌కుమార్, బుద్దాల రమణ ఉన్నారు.

## మానసిక ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

**కృష్ణాదేవిపేట, అక్టోబరు 10 :** మానసిక ఒత్తిడిని అధిగమిస్తే అనారోగ్యం దరి చేరదని గొలుగొండ, కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్యామ్‌కుమార్, హరిప్రవీణ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సంలో సందర్భంగా గురువారం కృష్ణాదేవిపేట, గొలుగొండ పీహెచ్‌సీల వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎన్.గాయత్రి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మాడుగుల :** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం బార్ ఉపాధ్యక్షులు శ్రీనాధు ప్రసాదరావు మాట్లాడుతూ మానసిక ప్రశాంతతో ఆరోగ్యం స్థిమితంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డా.ఎల్.శ్రీనివాసరావు, ఆస్పత్రి సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడా స్థలం ఏర్పాటుకు స్థల పరిశీలన


సలాన్ని పరిశీలిస్తున్న సర్వేయర్, కూటమి నేతలు

**గొలుగొండ, అక్టోబరు 10 :** మండల కేంద్రంలో ఆటస్థలం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని గురువారం మండల సర్వేయర్, స్థానిక కూటమి నేతలు పరిశీలించారు. గొలుగొండలో క్రీడలకు ఆట స్థలం కేటాయించాలంటూ కూటమి నాయకులు ఇటీవల తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించిన మేరకు స్థల పరిశీలన చేశారు. మండల పరిషత్ ఆవరణలో సుమారు ఎకరా ప్రభుత్వ స్థలం కేటాయించేందుకు చర్యలు చేపడుతున్నట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చినప్పారావు, జనసేననాయకులు బోయిన చిరంజీవి, టీడీపీ నాయకులు పుల్లేటికుర్తి రమేష్ పాల్గొన్నారు.

# పార్కుల సుందరీకరణపై దృష్టి

» చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు » పలు మండలాల్లో స్వచ్ఛతా హీ సేవ

**చోడవరం, అక్టోబర్ 10 :** పట్టణంలో పార్కుల సుందరీకరణకు ప్రాధాన్యమివ్వనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సీతారామయ్య పార్కులో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులను ఆధునీకరించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ డి.రాజేశ్వరి, ఎంపీడీవో అంజనేయులు, ఈవోపీఆర్డీ మహేష్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

**కె.కోటపాడు :** రోడ్లపై చెత్త వేయవద్దని, గ్రామ పంచాయతీలు అందించిన తడి, పొడి చెత్త ప్లాస్టిక్ డబ్బాల్లో చెత్త వేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి ప్రజలను కోరారు. గురువారం మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డులో పారిశుధ్య నిర్వహణ చేపట్టారు. ముఖ్యంగా చిరు వ్యాపారులు చెత్తను బయల పారబోయవద్దన్నారు. పారిశుధ్య నిర్వహణపై దుకాణదారులకు అధికారులు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, ఈవోపీఆర్డీ జి.రమణి, గ్రామ సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాకవరపాలెంలో చెత్తను తొలగిస్తున్న మండల ప్రత్యేకాధికారి మనోరమ తదితరులు


కె.కోటపాడులో వీధులు శుభ్రం చేస్తున్న దృశ్యం


దేవరాపల్లిలో చెత్త తొలగింపులో పాల్గొన్న అధికారులు


సీతారామయ్య పార్కులో స్వచ్ఛత హీ సేవ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

**మాకవరపాలెం :** మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గురువారం స్వచ్ఛత హీ సేవ నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి మనోరమ, ఇతర అధికారులు పాల్గొని చెత్తాచెదారాన్ని ఏరివేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పారిశుధ్య నిర్వహణ జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలదొర, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

**దేవరాపల్లి :** స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం మండల ప్రత్యేక అధికారి సీహెచ్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ నిర్వహించారు. ఎంపీడీవో సువర్ణరాజు, పలువురు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# దుర్గాదేవిగా అమ్మవారు

» భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు » పలు చోట్ల అన్నసమారాధనలు


నర్సీపట్నంలో దుర్గాదేవి


చోడవరం : సహస్ర రక్షల పూజా అవతారంలో దుర్గాదేవి


రావికమతం : కొత్తకోటలో దుర్గాదేవి


కృష్ణాదేవిపేట : సారె తీసుకెళుతున్న మహిళలు

**నర్సీపట్నం, అక్టోబరు 10 :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎనిమిదో రోజైనఅమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం నర్సీపట్నం శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలు సందర్భంగా సామూహిక కుంకుమార్చనలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు జె.నాగేంద్రరాజు, జాలమూరి రాజ్‌కుమార్, రుత్తల కృష్ణ పాల్గొన్నారు.

**చోడవరం :** పట్టణంలోని పాత బస్టాండ్ ఆవరణలోని దుర్గాదేవి సహస్ర రక్షల పూజాఅవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శివ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

### దుర్గాదేవి ఆలయంలో బేతాళుడు

దుర్గాదేవి ఆలయంలో స్థానిక బాలుడు పోతుగంటి సాయిఈశ్వర్ బేతాళుడిగా అమ్మవారి సన్నిధిలో 5 రోజుల దీక్షలో కూర్చున్నాడు. 9 నుంచి 13 ఏళ్ల లోపు వయస్సు ఉన్నబాలలు ఈ దీక్షలో పాల్గొనేందుకు అవకాశం ఉంది. ఈ బాలుడి దీక్ష దసరా చివరి రోజు ఊరేగింపుతో పూర్తవుతుంది.బేతాళుడి దీక్షలో కూర్చున్న బాలుడు సాయిఈశ్వర్ అమ్మవారి ఆలయంలో భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.

**రావికమతం :** దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కొత్తకోట ఆలయంలో అమ్మవారు గురువారం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు వేపా రామకృష్ణకిశోర్ పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే కొత్తకోట శ్రీశాంతి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక కోటవారి రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవీనవరాత్రుల మండపం వద్ద గురువారం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో బి.బుల్లిబాబు, టి.శేఖర్, సత్తిబాబు, కె.శ్రీను పాల్గొన్నారు.

**దేవరాపల్లి :** మండలంలోని బి.కింతాడలో నిర్వహిస్తున్న దేవీనవరాత్రుల్లో భాగంగా గురువారం సారె భోజనాలను తలపించేలా పిండివంటలతో అన్నసమారాధన నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, జడ్పీటీసీ కర్రి సత్యం నేతలు బూరే బాబూరావు, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఉమామహేశ్వరీదేవీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. టీడీపీ కార్యదర్శి బండారు అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. కొత్త నాగయ్యపేటలో నిర్వహించిన అన్న సమారాధన నిర్వహించారు.


చోడవరంలో భేతాళ దీక్షలో ఉన్న బాలుడు

**కృష్ణాదేవిపేట :** దేవీనవరాత్రులను పురష్కరించుకునిగొలుగొండ మండలం సీహెచ్ నాగాపురంలో భవానీ భక్తులు, మహిళలు ఆధ్వర్యంలో దుర్గమ్మకు సారె సమర్పించారు. వివిధ రకాల పిండివంటలు, అరటిగెలలతో డప్పులు మోగించుకుంటూ దుర్గమ్మ గుడికి సారె తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో భవానీ భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

**మాడుగుల రూరల్ :** మండలంలోని కింతలిలో దుర్గాదేవి నవరాత్రి మహోత్సవం సందర్భంగా గురువారం స్థానిక సాయియూత్ అధ్వర్యంలో సామూహిక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ చేశారు.


దేవరాపల్లిలో నిర్వహిస్తున్న అన్నసమారాధన


మాడుగుల రూరల్ : కింతలిలో

## తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**నర్సీపట్నం రూరల్, అక్టోబరు 10 :** పిలక దశ నుంచి చిరు పొట్ట దశలోకి వచ్చిన వరి పంట పాముపొడ తెగులు, ఆకు ముడత పురుగు, సోకుతున్నట్టు గుర్తించామని వ్యవసాయశాఖ ఏడీ శ్రీదేవి తెలిపారు. గురువారం డివిజన్‌లోని పలు గ్రామాలలో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాము పొడ తెగులు గుర్తించిన వెంటనే పొలం గట్టు మీద కలుపు తొలగించాలని సూచించారు. రైతులకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రామారావు



**మాకవరపాలెం, అక్టోబరు 10 :** నర్సీపట్నం తహసీల్దార్‌గా పని చేస్తున్న లోకవరపు రామారావుకు మాకవరపాలెం తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు తదితరులు కలిసి అభినందించారు.

# విద్యుత్ స్మార్ట్ మీటర్లు

... 7వ పేజీ తరువాయి

సమక్షంలో పాత మీటర్లను తొలగించి, వాటి స్థానంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. లైన్‌మన్ పాత మీటరు రీడింగ్ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. తరువాత పాత మీటరును కార్యాలయంలో అందజేస్తున్నారు. నర్సీపట్నం డివిజన్‌లో కేటగిరీ-2 వాణిజ్య సర్వీసులు 23,641, పరిశ్రమల సర్వీసులు 902, ప్రభుత్వ సర్వీసులు 6,352.. కలిపి మొత్తం 30,895 సర్వీసులు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు సుమారు మూడు వేల సర్వీసులకు స్మార్ట్ మీటర్లు బిగించారు. ఏదైనా ప్రాంతంలో విద్యుత్ సమస్య తలెత్తితే స్మార్ట్ మీటరు వల్ల పరిష్కారం చాలా సులభతరమవుతుందని సిబ్బంది అంటున్నారు.

### ప్రస్తుతానికి పాత మీటరు మాదిరిగానే..

స్మార్ట్ మీటర్‌కు ప్రీపెయిడ్ సర్వీస్ సిస్టమ్ యాక్టివేట్ చేసే వరకు పాత మీటరులాగే పని చేస్తుందని ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ తెలిపారు. ఇళ్ల సర్వీసులకు కూడా స్మార్ట్ మీటర్లు అమర్చడం పూర్తయితే ప్రీపెయిడ్ సర్వీసు అందుబాటులోకి వస్తుంది. అప్పటి వరకు స్మార్ట్ మీటర్లు బిగించిన పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ రంగ సర్వీసులకు ప్రతి నెలా రెండో తేదీన రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ వున్న సెల్ ఫోన్‌కి మెసేజ్ వస్తుంది. ఎన్ని యూనిట్లు వినియోగించారు, ఎప్పటిలోగా బిల్లు చెల్లించాలో తెలియజేస్తారు. ఇప్పటి మాదిరిగానే 15 రోజుల్లో బిల్లు చెల్లించకపోతే అపరాధ రుసుము తప్పదు. 30 రోజుల్లో చెల్లించకపోతే విద్యుత్ సరఫరా ఆపేస్తారు. స్మార్ట్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన తరువాత సెల్‌ఫోన్ రీచార్జి మాదిరిగా ముందుగానే డబ్బులు చెల్లించాల్సి వుంటుంది. రీచార్జి చేయించుకున్న నగదుకు తగ్గట్టు విద్యుత్ వినియోగించుకోవాలి. ఖాతాలో నగదు నిల్వలకు సంబంధించి ఎప్పటికప్పుడు పరిశీలించుకునే వెసులుబాటు వుంటుంది. నగదు నిల్వ అయిపోక ముందే రీచార్జి చేసుకోవాలి. లేదంటే ఆటోమెటిక్‌గా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

# సలామ్ టాటా

... 7వ పేజీ తరువాయి

అన్నారని నాటి సమావేశంలో పాల్గొన్న పలువురు గుర్తు చేసుకున్నారు.

### ఏయూ పూర్వ విద్యార్థుల సమావేశంలో రతన్‌టాటా ప్రసంగం ఇలా సాగింది...

'మానవాళికి మేలుచేసే సరికొత్త ఆవిష్కరణల కోసం పరిశోధనలు చేయాలి. ప్రస్తుత అవసరాలను అనుగుణంగా విద్యా సంస్థలు బోధన, పరిశోధనలకు పరిశ్రమలతో కలిసి పనిచేయాలి. విద్యా వ్యవస్థను వాణిజ్య విపణితో అనుసంధానించడంతోపాటు వాటికి చేరువ చేయాల్సిన అవసరం ఉంది. ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేయడానికి టాటా గ్రూపు సిద్ధంగా ఉంది. వైద్యం, డేటా ఎనాలిసిస్, హ్యూమన్ జీనోమ్ వంటి రంగాల్లో పరిశోధనలు చేయాలి. వర్సిటీలకు పూర్వవిద్యార్థుల సహకారం అవసరం.' అని రతన్‌టాటా అన్నారు. విశాఖలో పెట్టుబడుల గురించి మాట్లాడుతూ ఏపీ పరిశ్రమలు పెట్టాలనే దానిపై దృష్టిసారిస్తామన్నారు. నాడు ఆయన చెప్పిన మాట ప్రకారం...విశాఖలో టీసీఎస్ కంపెనీ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది.

### విశాఖ గురించి రతన్‌టాటా....

"విశాఖ డైనమిక్ సిటీ. దేశంలోనే పరిశుభ్రమైన నగరం. అటువంటి నగరానికి టాటా గ్రూపు తోడ్పాటునందిస్తుంది. విశాఖలో గడిపిన ఈరోజు జీవితాంతం గుర్తుంచుకుంటా. దేవుడు ఇచ్చిన జీవితం ఉన్నంత వరకూ డిసెంబరు 10న విశాఖలో పర్యటన, ఇక్కడ గడిపిన క్షణాలు నా మదిలో ఉంటాయి. నాపై అభిమానంతో ఏర్పాటుచేసిన ప్రత్యేక నృత్య ప్రదర్శన ఎంతో ఆనందం కలిగించింది."

తనపై ప్రదర్శించిన నృత్య రూపకాన్ని రతన్‌టాటా ఎంతో ఆసక్తిగా తిలకించడమే కాకుండా నృత్యకారులను సత్కరించి వారితో ముచ్చటించిన విషయాన్ని ఏయూకు చెందిన ఆచార్యుడొకరు గుర్తుచేసుకున్నారు. రతన్‌టాటా హాలులోకి వచ్చినప్పుడు, ఆయనకు చిత్రపటం బహూకరించినప్పుడు...ఇలా పలుసార్లు సభికులంతా లేచి హర్షధ్వానాలు చేశారు. ఆ కార్యక్రమం అనంతరం తాజ్ హోటల్‌లో ఏయూ విభాగాధిపతులతో రతన్‌టాటా భేటీ అయినప్పుడు దేశీయంగా సంపద సృష్టించే కంపెనీలు ఏర్పాటుచేసే దిశగా యువత ఆలోచన చేసేలా వారిని సన్నద్ధం చేయాలని సూచించారు.

## దేశం గొప్ప వ్యక్తిని కోల్పోయింది

- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం :** ప్రముఖ వ్యాపారవేత్త, మానవతావాది రతన్ టాటా మన మధ్య లేకపోవడం బాధాకరమని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం ఆయన అమెరికా నుంచి విలేకరులకు పంపిన సందేశంలో రతన్ టాటా మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. దేశం గొప్ప వ్యక్తిని కోల్పోయిందని, ఆయన మరణం దేశానికి తీరని లోటు అని పేర్కొన్నారు.

## తూతూమంత్రంగా స్వచ్ఛతా హీ సేవ


పర్యవేక్షణకే పరిమితమైన అధికారులు, సిబ్బంది

**చీడికాడ, అక్టోబరు 10 :** మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ తూతూమంత్రంగా సాగింది. దుకాణాల వద్ద ఉన్న చెత్తను దిగువస్థాయికి చెందిన ఇద్దరు లేక ముగ్గురు సిబ్బంది ఏరి వేయించి మిగతా ఉద్యోగులు పర్యవేక్షణకు పరిమితమయ్యారు. ఒక గంట అటుఇటూ తిరిగి అధికారులు తమ కార్యాలయాలకు వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కామేశ్వరరావు, సూపరింటెండెంట్ ఎల్.కామేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కనకమ్మ, పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కోనాం సంతలో గొర్రెలు, మేకలకు మహా గిరాకీ


మేకలను విక్రయిస్తున్న గిరిజన రైతులు

**చీడికాడ, అక్టోబరు 10 :** మండలంలోని గురువారం నిర్వహించే కోనాం సంతలో గొర్రెలు, మేకలు, నాటుకోళ్లకు మహా గిరాకీ కనిపించింది. ఈ నెల 12న విజయదశమి కావడంతో కోనాం పంచాయతీతో పాటు పాడేరు, అనంతగిరి మండలాలకు చెందిన గిరిజన గ్రామాల నుంచి గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల అధికసంఖ్యలో వాటి పెంపకందారులు అమ్మకానికి తీసుకొచ్చారు. అలాగే మైదాన ప్రాంత వర్తకులు, చిరు వ్యాపారులు కూడా అధికసంఖ్యలో కోనాం వచ్చారు. కిలోన్నర ఉన్ననాటుకోడి పుంజు రూ.1200లు నుంచి రూ.1400లు వరకూ పలకగా, అలాగే సాధారణ రోజుల్లో రూ.ఆరు వేలు పలికే మేకపోతు రూ.9 వేలు నుంచి రూ.10వేలు వరకూ ధర పలకడం విశేషం. అలాగే రూ.9 వేలు ఉన్న గొర్రెపోతు రూ.13 వేలు వరకూ ధర పలికింది.

## 'పల్లె పండుగ'కు సమగ్ర సమాచారంతో రావాలి : ఎంపీడీవో


సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖ అధికారులు

**చీడికాడ, అక్టోబరు 10 :** ఈ నెల 14 నుంచి జరగనున్న పల్లె పండుగ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీవో హేమసుందరావు కోరారు. వచ్చే సోమవారం నుంచి అన్ని పంచాయతీల్లో చేపట్టే ఈ కార్యక్రమానికి అధికారులంతా తమ నివేదికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో సూపరింటెండెంట్ కామేశ్వరరావు, ఏపీవో అల్లు గంగునాయుడు, ఏఈలు శరగడం పరదేశి నాయుడు, సూరిబాబు, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మాడుగులలో వర్షం



**మాడుగుల రూరల్, అక్టోబరు 10 :** మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు వాతావరణం సాధారంగానే ఉంది.ఆ తర్వాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పువచ్చింది. తేలికపాటి జల్లులతో ఆరంభమై మోస్తరు వర్షం పడింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

## లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

... 7వ పేజీ తరువాయి

వాహనాలు ఏమీ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులతోపాటు బస్సులోని ప్రయాణికులు అభిప్రాయపడ్డారు. లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడని, బస్సు వేగాన్ని నియంత్రించేలోపే ప్రమాదం జరిగిందని బస్సు డ్రైవర్ తాతాజీ చెప్పాడు. ప్రమాదం గురించి తెలుసుకున్న ఎస్‌ఐ విభీషణరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. హైవే సిబ్బంది వచ్చి ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తీయించడంతో వాహనాల రాకపోకలు యథావిధి గా సాగాయి. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

☛ సంక్షిప్తంగా..

## నేటి నుంచి 'మనగుడి'

**దేవరాపల్లి, అక్టోబరు 10 :** 'మనగుడి'లో భాగంగా స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి రెండు రోజుల పాటు ప్రత్యేక భక్తి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకురాలు సుశీల తెలిపారు. శుక్రవారం లక్ష కుంకుమ పూజలు, సామూహిక లలితా పారాయణం, 12న విజయదశమి రోజు విశిష్ట ప్రవచనం, రాత్రికి అన్నమాచార్య సంగీత కార్యక్రమం, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

### రతన్ టాటా మృతి తీరని లోటు : ధర్మశ్రీ

**చోడవరం, అక్టోబర్ 10 :** పారిశ్రామిక వేత్త దేశ నిర్మాణంలో ప్రధానపాత్ర పోషించిన రతన్ టాటా మృతి దేశానికి తీరనిలోటని మాజీ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ పేర్కొన్నారు. రతన్‌టాటా భారతావని ముద్దుబిడ్డ అన్నారు. ఆయన యువతకు స్ఫూర్తిప్రదాత అని కొనియాడారు.

### 22 మద్యం షాపులకు 383 దరఖాస్తులు

**చోడవరం, అక్టోబర్ 10 :** స్థానిక ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ పరిధిలోని చోడవరం, దేవరాపల్లి, కె. కోటపాడు, బుచ్చెయ్యపేట మండలాల పరిధిలోని 22 మద్యం దుకాణాలకు గురువారం సాయంత్రం నాటికి 383 దరఖాస్తులు దాఖలైనట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ కేవీపీ, నాయుడు తెలిపారు. చోడవరంలో 8 దుకాణాలకు 120, బుచ్చెయ్యపేట మండలంలోని 5 దుకాణాలకు 87, దేవరాపల్లి మండలంలోని 4 దుకాణాలకు 84, కె.కోటపాడు మండలంలోని 5 దుకాణాలకు 92 దరఖాస్తులు వచ్చాయని సీఐ చెప్పారు. దరఖాస్తుల సమర్పణకు శుక్రవారం సాయంత్రం 7 గంటల వరకూ ఉందని చెప్పారు.

### 22 దుకాణాలు.. 387 దరఖాస్తులు

**నర్సీపట్నం :** ఎక్సైజ్ పరిధిలో మద్యం షాపులకు గురువారం సాయంత్రానికి 387 దరఖాస్తులు వచ్చినట్టు ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో 114, ఆఫ్‌లైన్‌లో 273 దరఖాస్తులు వచ్చాయన్నారు. మునిసిపాలిటీలో 7 దుకాణాలకు 80, నర్సీపట్నం రూరల్ పరిధిలో మూడు షాపులకి 24, రోలుగుంటలో 3 మద్యం షాపులకి 59, కోటవురట్ల మండలంలో 4 షాపులకు 54, మాకవరపాలెంలో 4 దుకాణాలకు 56 దరఖాస్తులు అందాయని తెలిపారు.

## 55 మంది రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు


**దేవరాపల్లి, అక్టోబరు 10 :** మండలంలోని చిననందిపల్లిలో బెస్ట్ ఫ్రెండ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ బ్లడ్ బ్యాంకు, మెడికవర్ ఆస్పత్రి సహకారంతో వీటిని నిర్వహించిన ఈ శిబిరంలో 55 మంది రక్తదానం చేయగా, 51మంది అవయవదానం చేసేందుకు అంగీకారం తెలిపారు. వైద్య శిబిరంలో 850 మంది రోగులకు డాక్టర్ అశోక్‌కుమార్, వై.శ్రావణి, ఎస్.జై.సాయిచందు వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ ఫ్రెండ్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు పీఎస్ బాబు, చైర్మన్ పల్లా సూరిబాబు, పి.సంతోష్‌రాజా, కె.శివ, పి.వెంకటరావు. మాజీ సర్పంచ్ పూడి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

## ఈవోపీఆర్డీగా కరుణాకర్

**మాడుగుల, అక్టోబరు 10 :** మాడుగుల ఈవోపీఆర్డీగా కె.కరుణాకర్ గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన మీనాకుమారి పద్మనాభం ఈవోపీఆర్డీగా బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో అనకాపల్లి డీపీవో కార్యాలయం నుంచి కరుణాకర్ బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ డి.సురేష్‌కుమార్, పీఎల్ సతీష్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై నామమాత్రపు చర్యలేనా?

» 2 టిప్పర్లకు స్వల్ప జరిమానా


ఇసుక తరలిస్తూ పట్టుబడిన వాహనాలు

**నర్సీపట్నం, అక్టోబరు 10 :** రెండు భారీ టిప్పర్లలో అక్రమంగా తరలిస్తున్న ఇసుకకు పట్టణ పోలీసులు పట్టుకొని నామమాత్రపు జరిమానా విధించి విడిచి పెట్టారు. గురువారం బలిఘట్టంలో ఇసుక లోడుతో వస్తున్న రెండు టిప్పర్లను పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఒక్కో టిప్పర్‌కి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించి టిప్పర్లును విడిచి పెట్టేశారు. ఒక్కో టిప్పర్‌లో 25 టన్నులు చొప్పున 50 టన్నులు ఇసుక ఉంటుంది. వాస్తవంగా మైనింగ్ నిబంధనల ప్రకారం ట్రాక్టర్‌కు రూ.10 వేలు, టిప్పర్‌కు రూ.20 వేలు జరిమానా కట్టించాలి. అక్రమ ఇసుకపై రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద దుమారం రేగుతున్న సమయంలో పట్టుకున్న రెండు ఇసుక టిప్పర్లు నామమాత్రంగా జరిమానా విధించి విడిచి పెట్టడంపై ప్రజల నుంచి సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. సామాన్య ప్రజలకు ఇసుక లభించక పోవడంతో నాలుగు నెలలుగా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాజకీయ నాయకులు, బడా కాంట్రాక్టర్లు భారీ టిప్పర్లతో రాజమండ్రి ఇసుకను అక్రమంగా ఇష్టానుసారం తరలిస్తుంటే అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పట్టణ ఎస్సై రమేశ్‌ను అడగ్గా.. మొదటి తప్పుగా భావించి రెండు టిప్పర్లకు రూ.10 వేలు చొప్పున జరిమానా విధించామని అన్నారు.

క్రైం... crime news

## మూడు వాహనాలు ఢీ




ఎలమంచిలి కొక్కిరాపల్లి జాతీయ రహదారిపై మూడు వాహనాలు ఢీకొన్న దృశ్యం

**ఎలమంచిలి,అక్టోబరు 10:** ఎలమంచిలి కొక్కిరాపల్లి ప్రేమ సమాజం సమీపంలో జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తూ మూడు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. గురు వారం తుని నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేయ డంతో వెనుక వస్తున్న కారు, ఆ వెనుకే వస్తున్న మరో లారీ ఒకదానిని మరొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కేవలం వాహ నాలు మాత్రమే దెబ్బతిన్నాయి. అందులో ఉన్నవారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## శ్రీకృష్ణ ఆలయంలో హుండీ చోరీ

» సుమారు రూ.40 వేలు అపహరణ



ఆలయ సమీపంలోని తుప్పల్లో హుండీ

**సబ్బవరం, అక్టోబరు 10:** మండలంలోని రాయపురఅగ్రహారం గ్రామంలో గురువారం వేకువ జామున 3 గంటల సమయంలో శ్రీకృష్ణ ఆలయంలోని హుండీని ఓ దొంగ ఎత్తుకుపోయాడు. హుండీలోని సొత్తు కాజేసి ఖాళీ హుండీని ఆలయం సమీపంలో తుప్పల్లో పడేసి వెళ్లిపోయాడు. గ్రామ సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం ఉదయం ఆలయ పూజారి పూజలు నిమిత్తం ఆలయం తలుపులు తెరిచారు. అయితే ఆలయంలో ఉండాల్సిన హుండీ కనిపించకపోవడంతో సర్పంచ్ పిల్లల అప్పలనాయుడుకు సమాచారం ఇచ్చారు. సర్పంచ్ వచ్చి పరసరాలను పరిశీలించారు. ఆలయ సమీపంలో ఖాళీ హుండీ కనిపించింది. దీంతో సర్పంచ్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బందితో వచ్చి వివరాలు సేకరించారు. సీసీ ఫుటేజీ సాయంతో దర్యాప్తు చేస్తున్నారు. గుర్తు తెలియని ఓ వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించి హుండీ ఎత్తుకెళ్లినట్టు సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. సుమారు రూ. 40 వేలు వరకు నగదు హుండీలో ఉంటుందని సర్పంచ్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

## నకిలీ విలేకరిపై పోలీసులకు ఫిర్యాదు



రైస్ మిల్లు వద్దకు వెళ్లి డబ్బులు డిమాండ్ చేసిన నకిలీ విలేకరి

**అనకాపల్లి, అక్టోబరు 10:** సబ్బవరం మండలం లగిశెట్టిపాలెంలో గల ఒక రైస్ మిల్లు వద్దకు వెళ్లి 'ఆంధ్రజ్యోతి' విలేకరినని చెప్పి డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై సంస్థ స్థానిక ప్రతినిధి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. లగిశెట్టిపాలెంలో గల రైస్ మిల్లు వద్దకు గురువారం మధ్యాహ్నం కారు (టిఎస్ 08 జెడి 7713)లో ఒక వ్యక్తి వెళ్లాడు. తాను 'ఆంధ్రజ్యోతి' విలేకరినంటూ డబ్బులు డిమాండ్ చేశాడు. అయితే అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి అనుమానం వచ్చి స్థానిక ఆంధ్రజ్యోతి ప్రతినిధికి సమాచారం ఇచ్చారు. అతను వెళ్లేసరికి నకిలీ విలేకరి కారును వదిలేసి పరారయ్యాడు. నకిలీ విలేకరి ఫొటోను అక్కడ సిబ్బంది స్థానిక రిపోర్టర్‌కు అందజేశారు. తన పేరు ఖండిపల్లి ప్రసాద్ అని, 'ఆంధ్రజ్యోతి' చోడవరం స్టాఫ్ రిపోర్టర్‌నని చెప్పినట్టు సిబ్బంది సమాచారం తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీసులకు 'ఆంధ్రజ్యోతి' విలేకరి ఫిర్యాదు చేయగా సీఐ పిన్నింటి రమణ కేసు నమోదుచేశారు.

## పార్వతీపురం మన్యం జిల్లాకు కుమ్కి ఏనుగులు

» విశాఖ అటవీ ముఖ్య సంరక్షణాధికారి దివాన్ మైదీన్

**విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):** ఒడిశా నుంచి పార్వతీపురం మన్యం జిల్లాలోకి వస్తున్న ఏనుగుల నుంచి పంటలు, ప్రజలను రక్షించేందుకు కర్ణాటకకు చెందిన కుమ్కి ఏనుగులు తీసుకువస్తామని విశాఖపట్నం అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి బి.మహ్మద్ దివాన్ మైదీన్ అన్నారు. సీసీఎఫ్‌గా బాధ్యతలు తీసుకున్న ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఒడిశా నుంచి 10 ఏనుగులు పార్వతీపురం మన్యం జిల్లాకు వచ్చి మనుషులపై దాడి చేయడంతో పాటు, పంటలు ధ్వంసంచేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కుమ్కి ఏనుగులను మచ్చిక చేసుకునేలా ముగ్గురు ఉద్యోగులను శిక్షణకు పంపిస్తున్నామన్నారు. విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాలో నగర వనాలు అభివృద్ధి చేస్తున్నామని, త్వరలో వీటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఏకో టూరిజం అభివృద్ధికి పెద్ద పీట వేస్తామన్నారు. కంబాలకొండలో ఏకో టూరిజం సర్క్యూట్ విజయవంతమయిందన్నారు. నగరానికి చుట్టుపక్కల విలువైన అటవీ భూముల చుట్టూ గోడలు, ఫెన్సింగ్ ఏర్పాటు, నిరంతరం మొబైల్ టీంలు పనిచేసేలా ఒక ప్రణాళిక అమలుచేస్తామన్నారు. విశాఖ జంతు ప్రదర్శనశాలలో ప్రస్తుతం 97 రకాల జంతువులున్నాయని, వీటి సంఖ్యను పెంచడంతోపాటు దేశంలో ఉత్తమమైన జంతు ప్రదర్శనశాలలో ఒకటిగా తీర్చిదిద్దుతామన్నారు. విశాఖ సర్కిల్‌లో అడవుల సంరక్షణ, చెట్ల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. అటవీ ఉత్పత్తులు విరివిగా పెరిగేలా, తద్వారా ఆదాయం సమకూర్చుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. అడవుల సంరక్షణలో భాగంగా ఉపాధిహామీ నిధులతో పెద్దఎత్తున నర్సరీలు పెంపకం చేపట్టి ప్రజలు, రైతులు, వివిధ ప్రభుత్వ సంస్థలకు అందజేయడంతోపాటు తమ శాఖ మొక్కలు నాటేలా ప్రణాళికలు అమలుచేస్తామన్నారు. కొండలు చుట్టూ కందకాలు తవ్వకం, చెక్‌డ్యామ్‌లు, నీటి కుంటలు ఏర్పాటు చేస్తామన్నారు. అడవుల సంరక్షణలో భాగంగా ప్రతి పథకంలో గిరిజనుల్ని భాగస్థులను చేయడం వల్ల వారి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సాంకేతిక సహాయంతో అటవీ, ఆస్తుల రక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు.

## దంతెవార, జగదల్‌పూర్ మధ్య జన సాధారణ్ రైళ్లు

**విశాఖపట్నం, అక్టోబరు 10:** దసరా ఉత్సవాల్లో భాగంగా దంతేశ్వరి ఆలయాన్ని సందర్శించుకునే భక్తుల సౌకర్యార్థం దంతెవార, జగదల్‌పూర్ మధ్య ప్రత్యేక జన సాధారణ్ రైళ్లను నడుపుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08513 నంబరు గల రైలు ఈనెల 11 నుంచి 13 వరకు మధ్యాహ్నం 2.45 గంటలకు జగదల్‌పూర్‌లో బయలుదేరి సాయంత్రం 6.30 గంటలకు దంతెవార చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08514 నంబరు గల రైలు ఈనెల 11 నుంచి 13 వరకు సాయంత్రం 6.00 గంటలకు దంతెవారలో బయలుదేరి రాత్రి 8.45 గంటలకు జగదల్‌పూర్ చేరుతుంది. అలాగే 08515 నంబరు గల రైలు ఈనెల 11 నుంచి 13 వరకు రాత్రి 10 గంటలకు జగదల్‌పూర్‌లో బయలుదేరి అర్థరాత్రి 12.45 గంటలకు దంతెవార చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08516 నంబరు ఈనెల 12 నుంచి 14 వరకు ఉదయం 5 గంటలకు దంతెవారలో బయలుదేరి 7.45 గంటలకు జగదల్‌పూర్ చేరుతుంది. ఇక 08511 నంబరు గల రైలు ఈనెల 12 నుంచి 14 వరకు ఉదయం 8.15 గంటలకు జగదల్‌పూర్‌లో బయలుదేరి 11 గంటలకు దంతెవార చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08512 నంబరు గల రైలు ఈనెల 12 నుంచి 14 వరకు ఉదయం 11.30 గంటలకు దంతెవారలో బయలుదేరి మధ్యాహ్నం 2.15 గంటలకు జగదల్‌పూర్ చేరుతుంది.

### చికెన్ ధరలు

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 110.00 |
| లైవ్ ధర | 130.00 |
| విత్ స్కిన్ | 230.00 |
| స్కిన్ లెస్ | 240.00 |

### కోడి గుడ్లు (నెక్)

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 525 |
| విజయనగరం | 529 |
| శ్రీకాకుళం | 529 |

# 'రక్షణ' లేని వంతెనలు

» శారదా నదిపై ప్రమాదకరంగా మారిన ప్రయాణం



నారాయణపురం వద్ద మైనర్ శారదా నదిపై రక్షణ గోడలు లేని వంతెన. ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్ ఫొటో)

**రాంబిల్లి, అక్టోబరు 10:** మండలంలోని నారాయణపురం నుంచి ఎలమంచిలి; మర్రిపాలెం నుంచి రాజారాయుడుపాలెం వెళ్లే రోడ్డులో మైనర్ శారదా నదిపై ఉన్న వంతెనలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. తక్కువ ఎత్తులో వున్న ఈ వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతోపాటు శిథిలావస్థకు చేరుకున్నాయి. రాకపోకలు సాగించే క్రమంలో ప్రమాదానికి గురవుతామేమోనని ప్రజలు భయపడుతున్నారు.

శారదా నదిపై వంతెనలు నిర్మించి దశాబ్దాలు



మర్రిపాలెం- రాజారాయుడుపాలెం మధ్య మైనర్ శారదా నదిపై రక్షణ గోడలు లేని వంతెన

కావడంతో బలహీనంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాకాలంలో మైనర్ శారదా నది ఉధృతంగా ప్రవహిస్తుంది. వంతెనలకు ఇరువైపులా రక్షణగోడలు లేకపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. నదిలో నీటి ఉధృతి అధికంగా వున్నప్పుడు రాత్రి సమయంలో వంతెనల మీదుగా రాకపోకలు సాగించడం సాహసమేనని స్థానికులు అంటున్నారు. ఇటువంటి సమయంలో పిల్లలు, వృద్ధులు వంతెన మీదుగా వెళ్లడానికి భయపడుతున్నారు. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు. ప్రస్తుత ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ స్పందించి, శారదా నదిపై కొత్త వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని, లేకపోతే కనీసం రక్షణ గోడలు అయినా నిర్మించేలా చూడాలని పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## త్వరితగతిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ

» కలెక్టర్ విజయకృష్ణన్





మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్



హాజరైన సభ్యులు

**అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 10:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశమందిరంలో జిల్లాస్థాయి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పెండింగ్ కేసులపై సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం పెండింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ దీపిక మాట్లాడుతూ విజిలెన్స్ కమిటీ సభ్యులు తెలియజేసిన విషయాలపై చర్యలు తీసుకుంటామని, పౌర హక్కుల దినోత్సవాలకు కమిటీ సభ్యులకు సమాచారం అందిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 85 విచారణలో ఉన్నాయని, 293 పీటీ కేసులు పెండింగ్ ఉన్నాయన్నారు. ఆయా కేసుల్లో బాధితులకు చెల్లించాల్సిన పరిహారం రూ.21లక్షలు పెండింగ్ ఉందన్నారు. ఈ సమావేశంలో జేసీ జాహ్నవి, డీఆర్వో దయానిధి, ఆర్డీవోలు వీవీ రమణ, షేక్ ఆయిషా, డీఎస్పీలు పాల్గొన్నారు.

**జిల్లాలో పదివేల దోమల తెరల పంపిణీ**

జిల్లాలో పది వేల దోమల తెరలను ఉచితంగా పంపిణీ చేశామని, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో దోమ తెరల పంపిణీపై ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, మండల అభివృద్ధి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. సామాజిక నిధులు (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ) కింద వివిధ కంపెనీలు అందజేసిన పదివేల దోమ తెరలను విద్యార్థులకు అందజేశామన్నారు. పీవీటీజీ గ్రామాల్లో 2,390, గిరిజన గ్రామాల్లో 4,287, ఇతరులకు 1,168, వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలకు 1,443 చొప్పున పంపిణీ చేశామన్నారు. పంపిణీ చేసిన దోమతెరలను సక్రమంగా వినియోగించుకునేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులు దోమ తెరలను సక్రమంగా వినియోగించుకునేలా వార్డెన్‌లు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబుల్ వెల్ఫేర్ అధికారిణి నాగలక్ష్మి, పౌర సమాచార అధికారిణి ఇంద్రావతి పాల్గొన్నారు.

## అసంఘటిత కార్మికులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

» కార్మిక శాఖ సహాయ అధికారి బాలకృష్ణ



కార్మికులతో మాట్లాడుతున్న కార్మిక శాఖ సహాయ అధికారి బాలకృష్ణ

**కొత్తూరు, అక్టోబరు 10 :** అసంఘటిత రంగ కార్మికులైన ముఠా కార్మికులు కేంద్ర ప్రభుత్వ ఈ-శ్రమ్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని అనకాపల్లి కార్మిక శాఖ సహాయాధికారి కె.బాలకృష్ణ కోరారు. గురువారం ఆయన అనకాపల్లి పట్టణంలోని సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ-శ్రమ్‌లో ప్రమాద బీమా రూ.2 లక్షలు, అంగవైకల్యానికి రూ.లక్ష బీమా అందిస్తుందని తెలిపారు. అసంఘటిత రంగ కార్మికులతో పాటు బిల్డింగ్ వర్కర్లు, చిల్లర వర్తకులు ఈ పథకంలోకి చేరవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైదుబాబు, గంటా శ్రీరామ్, ముంద రాము తదితరులు పాల్గొన్నారు.

# బార్క్ తీరుతో రైతుల ఇక్కట్లు

» రోడ్డుకి ఇరువైపులా ఇనుప ముళ్ల కంచె ఏర్పాటు

» నివాసాలకు అవతలవైపున పంట పొలాలు

» కంచె కారణంగా నాలుగు కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి



బార్క్ రోడ్డు పక్కన వేసిన ఇనుప కంచె

**అచ్యుతాపురం, అక్టోబరు 10:** బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్(బార్క్)కి రోడ్డు కోసం పలువురు రైతులు భూములను త్యాగం చేశారు. నారపాక జంక్షన్ నుంచి బార్క్ వరకు 100 అడుగుల రోడ్డు ఏర్పాటైంది. తమ గ్రామాన్ని అనుకొని పెద్ద రోడ్డు వచ్చిందని రైతులంతా సంతోషించారు. కానీ ఆ రోడ్డు మీదుగా ప్రయాణించవద్దంటూ బార్క్ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుంటున్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బాబా అణు పరిశోధన కేంద్రం(బార్క్)కి సెజ్‌లో ఏపీఐఐసీ సుమారు 2,200 ఎకరాల భూమిని కేటాయించింది. బార్క్‌కు వెళ్లడానికి అచ్యుతాపురం- గాజువాక ప్రధాన రహదారిలో నాగవరం నుంచి రోడ్డు వేయాల్సి వచ్చింది. అప్పట్లో బార్క్‌కి రోడ్డు కోసం ఏపీఐఐసీ అధికారులు దొప్పెర్లలో 40 ఎకరాల భూమిని సేకరించారు. అనంతరం రెండు వరుసల రహదారి నిర్మించారు. తమ భూములను ఆనుకొని ఉన్న ఈరోడ్డుపై రాకపోకలు సాగించవచ్చని రైతులు భావించారు. కానీ అధికారులు రోడ్డుకి ఇరువైపులా ఇనుప ముళ్ల కంచె వేశారు. ఈ కంచెతోనే రైతులకు చిక్కొచ్చి పడింది. బార్క్ రోడ్డుకి ఇరువైపులా భూములు వున్నాయి. నివాసాలకు అవతల వైపున వున్న పొలాలకు వెళ్లాలంటే ఇనుప ముళ్ల కంచె వేయడంతో వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. తమ భూములకు వెళ్లాలంటే నాగవరం జంక్షన్, నారపాక జంక్షన్ మీదుగా నాలుగు కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలి



కొల్లి దేముడు, రైతు, దొప్పెర్ల

బార్క్ రోడ్డు కోసం మా భూమి 3.6 ఎకరాలు తీసుకున్నారు. రోడ్డుకి ఒక పక్క ఇల్లు, కొంత భూమి ఉంది. రోడ్డుకి అవతల వైపు మరికొంత భూమి ఉంది. గతంలో మా ఇంటికి, రోడ్డుకి మధ్య కొంతభాగం ఇనుప ముళ్ల కంచె వేయలేదు. దీంతో దీనిగుండా నాతోపాటు పలువురు రైతులు పొలాలకు వెళ్లే వాళ్లం. కానీ ఇటీవల ఈ దారిని కంచెతో మూసేశారు. కంచె పక్క నుంచి పది అడుగుల మేర సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తే రైతులకు ఇబ్బందులు తొలగుతాయి.

# శారదా పీఠం భూములపై ప్రభుత్వం ఆరా

» వైసీపీ హయాంలో భీమిలి మండలం కొత్తవలస వద్ద 15 ఎకరాలు కేటాయింపు

» ఎకరాకు రూ.1.89 కోట్లకు ఇవ్వవచ్చునని నాటి కలెక్టర్ సిఫారసు


» కేవలం రూ.లక్షకు ఇచ్చేసిన వైసీపీ పాలకులు

» వాస్తవ వివరాలతో ప్రస్తుతం జిల్లా యంత్రాంగం నివేదిక

**విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):** శారదా పీఠానికి గత వైసీపీ ప్రభుత్వం కారుచౌకగా జరిపిన భూ కేటాయింపుపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. పీఠం కార్యకలాపాలు విస్తరణ, సంస్కృత పాఠశాల ఏర్పాటుకు భూమి కేటాయించాలని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి గత ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు భీమిలి మండలం కొత్తవలసలో సర్వే నంబరు 102/2లో 7.7 ఎకరాలు, 103/2లో 7.3...మొత్తం 15 ఎకరాలు కేటాయించారు. ఆ సమయంలో ధర నిర్ణయించాలని ప్రభుత్వం అప్పటి జిల్లా కలెక్టర్‌ను కోరగా...రిజిస్ట్రేషన్ విలువను పరిగణనలోకి తీసుకుని ఎకరా రూ.1.89 కోట్లకు ఇవ్వవచ్చునని సిఫారసు చేశారు. దాని ప్రకారం ప్రభుత్వానికి శారదా పీఠం సుమారు రూ.30 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం ఎకరా కేవలం లక్ష రూపాయలకే ఇచ్చేసింది. అంటే 15 ఎకరాలను రూ.15 లక్షలకే ఇచ్చేశారు. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చాయి.

విశాఖపట్నం-భీమిలి బీచ్‌రోడ్డులో గల ఆ భూములు ఎంతో విలువైనవి. కొత్తవలసలో ఎకరా బహిరంగ మార్కెట్‌లో రూ.15 కోట్లు నుంచి రూ.20 కోట్లు వరకు ఉంది. అంటే పీఠానికి ఇచ్చిన భూముల విలువ సుమారు సుమారు రూ.250 కోట్ల నుంచి రూ.300 కోట్లు. పీఠానికి అడ్డగోలుగా భూములు కేటాయించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆ 15 ఎకరాలపై నివేదిక పంపాలని జిల్లా యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. కొత్తవలసలో శారదా పీఠానికి కేటాయించిన భూమి స్థితి?, రిజిస్ట్రేషన్ విలువ ఎంత?, ప్రభుత్వం ఎంతకు కేటాయించింది?...తదితర వివరాలు అడిగింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఇటీవల సమగ్ర వివరాలతో నివేదిక పంపింది.

## గజలక్ష్మిగా కనకమహాలక్ష్మి



విశాఖలోని బురుజుపేటలో గల శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు గురువారం గజలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని గాజులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

## రాయితీపై ఉల్లి, టమాటా విక్రయం



ఉల్లి, టమాటా అమ్మకాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

**అనకాపల్లి టౌన్, అక్టోబరు 10:** ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో శ్రీగౌరీ హోల్‌సేల్ కూరగాయల సంఘం ఆధ్వర్యంలో గురువారం రాయితీపై ఉల్లిపాయలు, టమాటాల విక్రయాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో ఉల్లిపాయలు కిలో రూ.60, టమాటా రూ.80 వరకు ధరలు పలుకుతుండడంతో ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై అమ్మకాలు జరపాలని నిర్ణయించింది. ఉల్లిపాయలు కిలో రూ.50, టమాటా కిలో రూ.50కి విక్రయిస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు మళ్ల జగ్గఅప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కాండ్రేగుల బుజ్జి, మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి శకుంతల, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు రేపు

**చీడికాడ, అక్టోబరు 10:** అప్పలరాజుపురంలో ఈ నెల 12న జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగుపోటీలు నిర్వహించనున్నట్టు సర్పంచ్ చుక్క అప్పలనాయుడు తెలిపారు. శ్రీలలితాదేవి దసరా నవరాత్రి ముగింపు ఉత్సవాన్ని పురష్కరించుకొని శనివారం వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు మధ్యాహ్నం అన్నసమారాధన, మూడు గంటలకు జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు, సాయంత్రం 4 గంటలకు మహిళలతో కోలాటాలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

## కేజీబీవీల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**రోలుగుంట, అక్టోబరు 10:** మండలంలోని రోలుగుంట కేజీబీవీలో ఖాళీగా ఉన్న హెడ్ కుక్, జె.నాయుడుపాలెం కేజీబీవీలో ఖాళీగా ఉన్న హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, చౌకీదార్ పోస్టులకు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో జాన్ ప్రసాద్ తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసే వారికి ఎటువంటి విద్యార్హతలు అవసరం లేదన్నారు. వయస్సు 42 ఏళ్లలోపు ఉండాలన్నారు. నెలకు రూ.15 వేలు వేతనం ఉంటుందన్నారు. దరఖాస్తులను ఎంఈవో కార్యాలయంలో అందజేయాలని ఎంఈవో జాన్